

# దీపిక

## కొడవంటి కాశీపతిరావు

"ఏవిటి...రచయిత గోపాలకృష్ణ మీరేనా..."అంటూ ఆశ్చర్యపోయింది దీపిక. ఆశ్చర్యాన్ని ఒక్క క్షణంలో విషాదం కమ్మేసింది. ఆ వెంటనే మనసులో చెలరేగుతూన్న ఆందోళనను తట్టుకోలేకపోయింది.

ఎర్రబడుతూన్న కళ్ళలోకి ఉబికుబికి రాబోతున్న కన్నీళ్ళూ, మండుతూన్న గుండెలోనుండి ఉరికురికి ముక్కుపుటాల ద్వారా గుప్పుమనబోతూన్న ఆవిరులు, భగభగమంటూన్న కడుపులోనుండి ఉడికుడికి ముఖం మీద పరుచుకుంటూన్న రంగులూ ...గబుక్కున లేచి బాత్‌రూమ్‌కేసి వెళ్ళింది దీపిక.

అక్క జీవితం ...అక్క రూపం ...అక్క ఆశయా...

మాడి మసైపోతే

వింటూ చూస్తూ ఏమీ చేయలేని తన అశక్తత, నిస్సహాయత, చేతగానితనం ఇన్నాళ్ళకి మళ్ళీ జ్ఞాపకానికొచ్చాయి. తల గోడకేసి దబ దబ బాదుకుంది. కళ్ళలోంచి కడుపులోని బాధను కసిగా కారనిచ్చింది. గుండెల్లో మంటను కసకొద్దీ ముఖంనిండా పరుచుకోనిచ్చింది.

పావుగంట గడిచేక శుభ్రంగా ముఖం కడుక్కుని తాజాగా వచ్చి స్టాఫ్ రూములో కూర్చుంది దీపిక.

"ఏవిటి... మధ్యలో సడెన్‌గా వెళ్ళిపోయేరూ..." అనడిగేడు కృష్ణమూర్తి.

"అబ్బే...ఏం లేదూ..." అంటూ నవ్వింది దీపిక.

"ఈ స్కూలుకి మీరొచ్చి మూణ్ణెల్లే కదా అయ్యింది. అంచేత మీకు తెలియకపోవచ్చును గాని నా పేరు కె. గోపాలకృష్ణమూర్తి అయినా స్కూలు రికార్డుల్లో కేజీ కృష్ణమూర్తి అని వుంటుంది. పోతే రచనలు మాత్రం గోపాలకృష్ణ పేరుతో చేస్తుంటాను." అని వివరిస్తున్నాడు కృష్ణమూర్తి.

ఈలోగా బెల్లయ్యింది.

"మీ రచనల గురించి తర్వాతెప్పుడైనా తీరిగ్గా చర్చించాలి. మీరే గోపాలకృష్ణ అని తెల్సిన తర్వాత వదుల్తాననుకున్నారా?" అంది దీపిక లేస్తూ.

ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు కృష్ణమూర్తి.

"తప్పకుండాను. మీరెప్పుడూ నన్ను వదిలిపెట్టకూడదనే నేనూ కోరుకుంటున్నాను." నవ్వుతూ పొంగిపోతూ అన్నాడు కృష్ణమూర్తి.

బెల్ కావడంతో మరిన్ని మాటలు ఆశించిన కృష్ణమూర్తికి నిరాశే ఎదురయ్యింది. గుండెల్లో సందళ్ళకూ ముఖంలోని రంగులకూ పొంతన కుదర్చలేకపోతున్న దీపికకు నిట్టూర్పే మిగిలింది.

క్లాసులో కూర్చున్న దీపిక గుండెల్లో చెలరేగుతున్న సంచలనాన్ని తట్టుకోలేకపోతోంది. తెరలు తెరలుగా వస్తున్న దుఃఖం ఆపుకుంటూ పిల్లలకు పర్కు ఇచ్చింది. ఆపైన దుఃఖానికి కారణమవుతున్న ఆలోచనలకే తావిచ్చింది.

ఎంతసేపటినుండో మనసులో ఏమూలనో చిన్నగా మెదులుతూన్న అక్క రూపం విశ్వరూపం దాల్చి ఎదుట నిల్చింది.

రాధిక!

రూపునెంత చక్కనిదెంత చల్లని మనసుది!

ఏదా చక్కని రూపం? ఏమై పోయిందా చల్లని మనసు?

పిచ్చిగా పత్రికలు చదివేది. వేలంవెర్రిగా గోపాలకృష్ణ కథలను గూర్చి వినేవారికీ విననివారికీ మరీ మరీ చెప్పేది.

'మీ(మా) పత్రికలో ప్రచురింపబడ్డ గోపాలకృష్ణగారి కథ నా మనసునెంతో ఆకట్టుకుంది. మరిన్ని కథలు ప్రచురిస్తారని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను'. అంటూ పత్రికలకు రాయడం ప్రారంభించిన ఉత్తరాల తోరణం గోపాలకృష్ణను తాకేవరకూ జరిగింది.

గోపాలకృష్ణనుండి మొదటిసారిగా ఉత్తరం వచ్చినరోజున... రాధిక రాధిక కాదు. గోపాలకృష్ణుని దర్శనంతో సంతోషపు కొండెక్కిన గోపిక. ఒక్కో కథలోనూ గోపాలకృష్ణ వెలిబుచ్చిన ఉన్నతమైన ఆశయాలూ, ఉదాత్తమైన అభిప్రాయాలూ ఎత్తిచూపుతూ ఒత్తిపలుకుతూ వివరించేది.

ఇది కేవలం రాధికకు సాహిత్యం మీదున్న అభిమానం మాత్రమే అనుకున్నారంతా. కాని అది గోపాలకృష్ణ మీద ప్రేమగా మారుతుందని, ఆ ప్రేమముందు తల్లిదండ్రుల్ని, రక్తసంబంధాల్ని, కట్టుబాట్లని కూడా కాదని వెళ్ళిపోతుందని ఊహించలేకపోయారు.

రాధిక వెళ్ళిపోయాక పత్రికలకి రాసి గోపాలకృష్ణ అడ్రసు తెలుసుకుని వెళ్ళిన తల్లిదండ్రులకి నిరాశే ఎదురయ్యింది. గోపాలకృష్ణ బిచాణా ఎత్తేసాడు! రాధిక నిజంగా గోపాలకృష్ణను కోరుకుందని చెప్పి వుంటే కాళ్ళా వేళ్ళా పడయినా అతన్ని తెచ్చి పెళ్ళి చేసేవారం కాదా అనుకుంటూను, మాట మాత్రం మాతో చెప్పనైనా చెప్పేవు కాదు తల్లీ అని బాధపడుతూను, అతను నిజంగా రాధికను ఏలుకుంటున్నాడో లేదో అని అనుమానపడుతూను, పిచ్చి బతుకేలాగే తీరు నేవిధంగా సాగుతున్నదో అని బెంగపడుతూను! తల్లీ తండ్రీ ఒకరినొకరు అనునయించుకుంటూను అనుకరిస్తూను మరణాన్ని ఆశ్రయించేరు.

ఆ తర్వాతెప్పుడో పోలీసువారిద్వారాను, పత్రికల ద్వారాను రాధిక ఆత్మహత్య గురించి తెలుసుకునే దురదృష్టం కలుగకుండానే వెళ్ళిపోయేరు వాళ్ళిద్దరూ.

మరి తను...?

యవ్వనం తెచ్చిన ఉత్సాహంతోనూ, కల్మషం యెరుగని మనసులో పొంగే ఆనందంతోనూ గంతులిడబోతోంది. జీవితంతోనూ కాలంతోనూ పోటీ పడుతూ పరుగులిడబోతోంది. అప్పుడప్పుడే చదువు ధ్యాసనుండి తలెత్తి రెండు కళ్ళతో లోకంలోకి చూడబోతోంది. ఆ క్షణంలోనే ఉద్యోగపు లోకంలో అడుగెట్టి రెండు



కాళ్ళమీదా నిలబడనోతోంది.

రాధికక్కా, తల్లీ, తండ్రీ అంతా వరసగా కనుమరుగై పోవడంతో దీపిక కళ్ళల్లో దీపాలు ఆరిపోలేదూ? కాళ్ళలో రక్తం ఆవిరులై పోలేదూ? కడుపులో పేగులు తెగిపోలేదూ?

అవునవును.

యవ్వనం, ఉత్సాహం, అందం, ఆనందం ఇంకా ఏవేవి చూసుకుని వేడివేడిని మనసులో నింపుకుని జీవితంలో పరుగులెట్టాలనీ కాలంతో గంతులెయ్యాలనీ అనుకుందో అవన్నీ ఏమైపోయేయి? మరింక ఏ విషాదం, ఏ కల్మషం, ఏ కన్నీళ్ళు, ఏ బాధలు తన ఇంట్లోకి, తన కంట్లోకి తన మనసులోకి, తన వయసులోకి రాకూడదనుకుందో అవన్నీ ఒక్కుమ్మడిగా వచ్చెయ్యలేదూ?

మరటువంటప్పుడు ఈ దీపిక ఏమనుకుందేమనుకుంది? 'తన కుటుంబాన్ని నామరూపాల్లేకుండా చేసినవాణ్ని చీరెయ్యాలనుకోలేదూ....? నరికేయాలనుకోలేదూ...? నిలువునా బూడిద చేయాలనుకోలేదూ...?

ఈనాడిప్పుడిక్కడిలా ఎదురయ్యేడు గోపాలకృష్ణ...కృష్ణమూర్తి అవతారంలో.

"ఏవిటి దీపికా...లాంగ్‌బెల్లయి చాలాసేపయినా ఏవిటిలా కూర్చుని వుండిపోయేరు. ముఖం చూస్తే మధుర స్మృతులేవో కదుల్తూ వున్నట్టున్నాయ్..." అని కృష్ణమూర్తి అంటున్నాడు కొంటెగా.

మనసులో ఏమున్నా ముసిముసిగా నవ్వింది దీపిక.

అంతేకాదు "మీ గురించే..." అని గోముగా అంది కూడా

చచ్చేపోయేడా మాటకి కృష్ణమూర్తి. తేరుకునేసరికి అరగంట పట్టింది. ఆ మధ్యకాలంలో దీపిక ఇంటికే చేరిపోయింది.

మర్నాడు స్కూలుకి రాగానే...

"ఒక్కమారిలా వస్తారా..." అన్నాడు కృష్ణమూర్తి. అందరికీ కాస్త దూరంగా వెళ్ళేరిద్దరూ.

"మీతో పరిచయమయ్యేక నా జీవితంలో లోటేమిటో తెలిసింది." అన్నాడు కృష్ణమూర్తి.

విని వూరుకుంది దీపిక.

"మీతో పరిచయమయ్యేక మీ గురించిన ఆలోచనల ప్రేరణతో మరిన్ని కథానికలు రాసేను." మళ్ళీ అన్నాడు మైమరచిపోతూ

విని నవ్వింది దీపిక

"మీతో పరిచయమయ్యేక మరో అమ్మాయితో జీవితాన్ని ఊహించుకోలేకుండా వున్నాను.... తిరిగి అన్నాడు తీయగా.

విని అంది దీపిక.

"మన పరిచయం కాక పూర్వం అమ్మాయిలతో మీ జీవితాన్ని నేనూహించనా..." అని.

తడబడ్డాడు కృష్ణమూర్తి.

"గోపాలకృష్ణుడు చుట్టూ రాధికలూ, గోపికలూతో రాసక్రీడలు సలుపకుండా వుంటాడా..." అంది అతని ముఖంలోకే చూస్తూ.

తింగుతిన్నాడు. పాలిపోయిన ముఖానికి రక్తంరంగు పులుముకోవడానికి ప్రయత్నిస్తూన్నాడు కృష్ణమూర్తి.

"అదేవిటిలా అయిపోయేరు? అసలే మగవారు. అందులోకీ కృష్ణనామధారులూ అందుకే అలా అన్నాను. కొంపదీసి నిజమేనేమిటి? ' అంది మళ్ళీ కవ్విస్తూను

"ఛ ఛ..." అని మాత్రం అన్నాడు కృష్ణమూర్తి.

"ఏదేమైనా నా గురించి మీరు తెలుసుకోకుండా, మీగురించి నేను తెలుసుకోకుండా మీరంతంత డైలాగులు మీ కథల్లోలా చెప్పేస్తే ఎలా. నా గురించి చెప్తాను. విన్నాక మీ డైలాగులు చెప్పండి. సంతోషిస్తాను...." అంది దీపిక.

"మా అక్కయ్య ఒకణ్ని ప్రేమించాననుకుని వెళ్ళిపోయి, మోసపోయి ఆత్మహత్య చేసుకుంది. అది భరించలేని నా తల్లిదండ్రులూ వెళ్ళిపోయేరు. పోతే ఇక్కడికొచ్చేక మీ గురించీ అలాంటి కథే విన్నాను. ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోకపోయేసరికి ఆ పిల్ల ప్రాణం తీసుకుందని మన స్టాఫ్‌లోనే చెప్పుకుంటుండగా అనేకసార్లు విన్నాను...."

ఏవీ మాట్లాగలేకపోయేడు కృష్ణమూర్తి.

"డైలాగులు గుప్పించే నోరు మూగపోయిందేం కృష్ణమూర్తి గారూ.... చెడి ప్రాణం తీసుకున్న పిల్ల చెల్లెల్ని చేసుకోవడానికి మీ సాహిత్యం తెచ్చిన సంస్కారం అడ్డుపడుతుందా? ఆదరిస్తుందా?" అని నిలవేసింది దీపిక.

"మీరిష్టపడాలేగాని.... మన గతాలు ఏమైనప్పటికీ మిమ్మల్ని చేసుకోవడానికి నేను సిద్ధమే...." అన్నాడు నిబ్బరంగా కృష్ణమూర్తి.

"జీవితానికి ఒకసారి కాక నెలకోసారి పదిహేను పంద కట్నం జీతం రూపంలో తెచ్చి పోస్తే ఎవరయినా చేసుకుంటారు. అయినా మరొక్క నిజం చెప్తాను. విన్నాక అప్పటికీ సిద్ధపడితే ఇంకా సంతోషిస్తాను...." అంది దీపిక అతని ముఖంలోకే చూస్తూ.

ఇరకాటంలో పడ్డట్టుగా ఇబ్బంది పడుతూన్న కృష్ణమూర్తి ముఖమే చెప్తోంది.

"రాధిక చెల్లెల్ని నేను." అంది దీపిక.

నోరు తెరచుకుని కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయేడు కృష్ణమూర్తి.

"అవును కృష్ణమూర్తిగారూ. ఇద్దరం కలిసే పనిచేస్తున్నాం కదా.... అనుక్షణం మీ కళ్ళ ఎదుట మెసుల్తున్న నాలో రాధికను చూస్తూనే వుంటారు. మీది నిజంగా నిష్కల్మష హృదయమే అయితే నిబ్బరంగా నన్ను చేపట్టగలరు. లేదూ అన్యాయమే చేసి వుంటే క్షోభకు గురయ్యే మీ హృదయమే ఆ విషయం చెప్తుంది. మీ నిర్ణయం ఆలోచించి చెప్పండి. నేను మాత్రం మిమ్మల్ని వదిలేది లేదు. వస్తానూ...." అంటూ చరచరా క్లాసులోకి వెళ్ళిపోతూన్న దీపికను చూస్తూ బొమ్మలా వుండిపోయేడు కృష్ణమూర్తి. ✱